## క్లుప్తంగా

### న్యాయం చేయరూ!

- తిరుపతి ఎంపీకి వినతి



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం ఇస్తున్న ఉచిత సేవకులు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎన్నో ఏళ్లుగా ఉచితంగా సేవ చేస్తున్న తమకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీ గురుమూర్తికి సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఉచిత సేవకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ చైర్మన్‌గా ఉన్న సమయంలో జీతభత్యాలు ఏర్పాటు చేయాలని కోరగా బోర్డు సమావేశంలో తీర్మానించి దేవదాయశాఖకు పంపించారన్నారు. దీనికి సమ్మతించిన వారు కమిషనర్‌కు అనుమతి ఇవ్వడం, జీతభత్యాలు దక్షిణామూర్తి ఏజెన్సీ ద్వారా ఇచ్చేందుకు అనుమతి ఇచ్చారన్నారు. అయితే తమను కాదని వేరేవారి పేర్లను మార్చి తమకు అన్యాయం చేస్తుండడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ ఆలయ అధికారులు కోర్టు ధిక్కరణకు పాల్పడుతూ కొత్తవారికి విధులు కేటాయిస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

### తోతాపురి రకం టన్ను రూ. 12 వేలు



మాట్లాడుతున్న ఏఓ భారతి

**బుచ్చినాయుడుకండ్రిగ:** తోతాపురి రకం మామిడి కాయలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర టన్ను రూ.12 వేలకు కొనుగోలు చేయాలని ఏఓ భారతి తెలిపారు. సోమవారం ఆమె గాజులపెళ్లూరు గ్రామంలోని రసా ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో తోతాపురి రకం మామిడి కాయల కొనుగోలుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర టన్ను రూ.12 వేలకు తోతాపురి రకం మామిడి కాయలను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి శారద, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

### కిసాన్ డ్రోన్ పంపిణీ



కిసాన్ డ్రోన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

**సత్యవేడు:** మండలంలోని సత్యవేడుకు చెందిన దేవాంష్ రైతు మిత్ర గ్రూపునకు 80 శాతం రాయితీపై కిసాన్ డ్రోన్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే, మండల అధికారులు కలసి కిసాన్ డ్రోన్‌ను రైతు సంఘం సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.9.80 లక్షల విలువ గల డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీతో అందించడం జరిగిందన్నారు. ఈ డ్రోన్ ద్వారా రోజుకు 40 నుంచి 50 ఎకరాలకు మందులు స్ప్రే చేయవచ్చన్నారు. ఆధునిక పద్ధతులు అవలంభించి రైతులు వ్యవసాయం చేపట్టి అధిక దిగుబడులు పొందాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ తరుణాక్షరెడ్డి, ఏఓ మురళి పాల్గొన్నారు.

## జాతరకు విద్యుత్ సొబగులు



విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు



రేణిగుంట మండలంలోని గురవరాజు పల్లె పంచాయతీ రామకృష్ణాపురంలో శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో రెండ్రోజుల పాటు జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళ, బుధవారం జాతర నిర్వహించనున్నారు. కుంట్రపాకు మునికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయడంతోపాటు గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. -రేణిగుంట

## ట్రాఫిక్ కష్టాలు..!



పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో గజిబిజిగా ఉన్న వాహనాలు

**శ్రీకాళహస్తి:** ముక్కంటి దర్శనార్థం దూర ప్రాంతాల నుంచి నిత్యం వేలల్లో భక్తులు వస్తున్నారు. పట్టణంలో నానాటికీ ట్రాఫిక్ సమస్యల అటు ప్రజలను, భక్తులను ఇక్కట్లకు గురి చేస్తోంది. గతంలో ట్రాఫిక్ సిబ్బంది షిఫ్ట్‌కు పదిమంది చొప్పున విధులు నిర్వర్తించేవారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా సిబ్బంది లేక ప్రస్తుతం సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులే ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పరిస్థితి కలుగుతోంది. గతంలో కుమారస్వామి తిప్ప వద్ద, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను మళ్లించడంతో భేరివారి మండపం మీదుగా దేవస్థానానికి వెళ్లేవారు. ట్రాఫిక్ సిబ్బంది సరిపడా లేకపోవడంతో కుమారస్వామి తిప్ప నుంచి వచ్చే వాహనాలు నేరుగా పెళ్లి మండపం మీదుగా దేవస్థానానికి వెళుతుండడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. సోమవారం ముక్కంటి క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో పెళ్లి మండపం వద్ద ట్రాఫిక్ ఎక్కువై సుమారు అరగంట పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులైనా దీనిపై దృష్టి సారించి ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

## సాక్షి కార్యాలయాలపై దాడులు హేయం



మాట్లాడుతున్న చిన్నా

**వరదయ్యపాళెం:** రాష్ట్రంలో టీడీపీ గూండాలు రెచ్చిపోతున్నారు. నిరసనకారుల ముసుగులో సాక్షి కార్యాలయాలపై దాడులకు తెగబడడం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి చిన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం వరదయ్యపాళెంలో నిర్వహించిన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సాక్షి కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు దుర్మార్గమన్నారు. విశ్లేషకుడు కృష్ణంరాజు వ్యాఖ్యలను సాక్షికి ఆపాదిస్తూ పథకం ప్రకారం సాక్షి కార్యాలయాలపై దాడులు చేపడుతున్నారని, ఇదంతా టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనన్నారు. ఇకనైనా ఇలాంటి సంస్కృతికి స్వస్తి పలకాలని హితవు పలికారు.

## టీచర్ల తిరుగుబాటు కూటమి ప్రభుత్వానికి చేటు



మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

**వరదయ్యపాళెం:** రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఉప్పెనలా తిరుగుబాటుకు దిగడం, కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలను మ్యాన్యువల్‌గా కాకుండా వెబ్ కౌన్సిలింగ్ చేపడుతూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులను మోసం చేశారంటూ ఆరోపించారు. అధికారం చేపట్టిన ఏడాదికే అటు ప్రజల నుంచి, ఇటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఆపాదించుకున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనని దుయ్యబట్టారు. జరుగుతున్న పరిణామాలు కూటమి ప్రభుత్వం పతనానికి నాంది పలుకుతాయని, ఇకనైనా రెడ్‌బుక్ రాజ్యాంగానికి స్వస్తి పలికి ప్రజాసంక్షేమ పాలన వైపు అడుగులు వేయాలని సూచించారు.

### గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మురళీరెడ్డి

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 68 మంది గర్భిణులకు వైద్యాధికారి మురళీరెడ్డి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే మహిళలు తమ వివరాలను ఏఎన్ఎం వద్ద నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుని, రక్తహీనత రాకుండా మందులను వాడాలన్నారు. మాతృత్వ వందన యోజన పథకం కింద రూ.5000 అకౌంట్లో జమ చేస్తామని, రెండవ కాన్పులో ఆడ శిశువు జన్మించిన వారికి మాత్రమే ఈ పథకం ప్రకారం మరో రూ.5000 వారి అకౌంట్లు జమ చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులు

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని లిటిల్ మాస్టర్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడు విభాగాలకు సంబంధించి సోమవారం బహుమతుల ప్రదానం చేశారు. 4 ఏళ్ల వ్యవధిలో 1 నుంచి 8వ లెవల్ వరకు పూర్తి చేసిన నూతి ఆకాంక్ష అనే విద్యార్థిని నిర్వాహకులు గ్రాడ్యుయేషన్ ఇచ్చారు. జిల్లాస్థాయిలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ చేతిరాత పోటీలు, అంతర్జాతీయ ఆన్‌లైన్ అబాకస్ పోటీలకు సంబంధించి ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎల్ఎంఏ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ దివ్య, చైర్మన్ మునికుమార్, విద్యార్థుల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



టిప్పర్ కింద ఇరుక్కున్న ఆటో

**రేణిగుంట:** మండలంలోని వెదళ్ల చెరువు వద్ద నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. శ్రీకాళహస్తి నుంచి వస్తున్న ఆటోను ముందు వెళ్తున్న టిప్పర్ హఠాత్తుగా వెనక్కి రావడంతో ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుచానూరుకు చెందిన తులసి, పుత్తూరుకు చెందిన ప్రదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు వారిని తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రేణిగుంట పోలీసులు తెలిపారు.

## బాలాజీరెడ్డికి నివాళి



బాలాజీరెడ్డి మృతదేహం నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**నారాయణవనం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పాలమంగళం దక్షిణం మాజీ సర్పంచ్ కుప్పస్వామిరెడ్డి, సర్పంచ్ ప్రేమలత కుమారుడు బాలాజీ రెడ్డి మృతికి పలువురు నివాళులు అర్పించారు. సోమవారం మధ్యాహ్నం నగరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీ రెడ్డి మృత్యువాత పడ్డాడు. ఈ విషయం తెలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ నాయకులు బాలాజీ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీటీసీ సభ్యుడు సుమన కుమార్‌తో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా కార్యవర్గ కార్యదర్శి రాకేష్ కిరణ్ వేర్వేరుగా నివాళులు అర్పించారు.

### రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి



మృతి చెందిన పూజ

**వరదయ్యపాళెం:** తమిళనాడులోని అప్పయ్యపాళెం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గర్భిణి మృతి చెందింది. వివరాలు.. మండలంలోని సిద్ధమగ్రహారం గ్రామానికి చెందిన మల్లికార్జున కుమార్తె పూజను అదే గ్రామానికి చెందిన వెంగయ్యతో రెండేళ్ల క్రితం వివాహం చేశారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన ఎగుముదిరి వద్ద వారపు సంత తన భర్తతో కలసి పూజ ద్విచక్ర వాహనంపై వెళ్లింది. ఈక్రమంలో అదుపు తప్పి ద్విచక్ర వాహనం కిందకు పడడంతో పూజ తలకు బలమైన గాయం తగిలింది. చికిత్స నిమిత్తం శ్రీసిటీలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరంబాకం పోలీసులు కేసు నమోదు చేసి శవ్మృతదేహాన్ని సోమవారం సాయంత్రం పూజ కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### ఆగంతకుల దాడి ముగ్గురికి గాయాలు



ఆగంతకుల దాడిలో గాయపడిన చక్రవర్తి

**రేణిగుంట:** మండలంలోని పాత రేణిగుంటకు వెళ్లే పాత రహదారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిపై ఆగంతకులు గాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. అంకమనాయుడుమిట్టలో నివసిస్తున్న చక్రవర్తి తన భార్య మీనా, కుమారుడు సుభాష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై రేణిగుంటకు వెళ్లి సోమవారం రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో దాడికి గురయ్యారు. ఆటోలో వేచి ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు హఠాత్తుగా వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచి అదృశ్యమయ్యారు. బాధితులు రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కుప్పటతాగేలిలో మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

**వరదయ్యపాళెం:** మండలంలోని కుప్పటతాగేలి వీధుల్లో పేరుకుపోయిన మురుగునీటి నిల్వపై సాక్షిలో సోమవారం 'మురుగు తొలగించండి' అని కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన చిన్న పాండూరు వైద్యఆరోగ్యశాఖ ఎంపీహెచ్ఈఓ రవీంద్రుడు, ఏఎన్ఎం సునీత, పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో రోడ్ల పక్కనే నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. అలాగే దోమలు వృద్ధి చెందకుండా క్రిమిసంహారక మందులను పిచికారీ చేశారు. అలాగే ఇళ్ల ముంగిట మురుగునీటి నిల్వలు చేయవద్దని స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.

## గంగ జాతరలో 'పేరంటాళ్లు' సందడి



పేరంటాళ్లు వేషంలో నడివీధి గంగమ్మకు తొలి మొక్కు చెల్లించిన యువకులు

**సత్యవేడు:** వందేళ్ల చరిత్ర ఉన్న సత్యవేడు గంగజాతరలో యువకులు ఆరోగ్య ప్రదాయిని అయిన గంగమ్మకు ఆనవాయితీగా తొలివేషం 'పేరంటాళ్లు' వేయడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ. ఈ నెల 11, 12 తేదీ(బుధ, గురు)ల్లో సత్యవేడులో గంగజాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో యువకులు పేరంటాళ్లు(మహిళవేషం)గా మొక్కు చెల్లిస్తారు. నూతనంగా ఉద్యోగాలు వచ్చిన యువకులు, అనారోగ్యంతో నలిగిన పిల్లలు, కుటుంబాల్లో ఇబ్బందులు తొలగిన యువకులు గంగ జాతర సందర్భంగా పేరంటాళ్ల వేషం వేయడం విశేషం. స్త్రీల వేషధారణలో ఉన్న పురుషులు తలపై కలశం ఉంచుకుని గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లావువీధి, గంగమిట్ట వీధుల్లో ప్రదర్శన గావించి నడివీధి గంగమ్మకు పర్మశాల వద్దకు వెళ్లి మొక్కులు చెల్లిస్తారు. శక్తికి ప్రతి రూపంగా భావించే గంగమ్మను గ్రామదేవతగా కొలుస్తున్నారు. కరువు కాటకాలు, రోగాల నుంచి దూరం చేయాలని గ్రామంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కులమతాలకు అతీతంగా జాతర నిర్వహిస్తున్నారు.

## కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

**సత్యవేడు:** కార్మిక చట్టాలకు విరుద్ధంగా తొలగించిన విశాఖ ఉక్కు పరిశ్రమ కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ప్రాంతీయ కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. సోమవారం సత్యవేడులో సీఐటీయూ నాయకులు, కార్మికులు కలసి తహసీల్దారు కార్యాలయం వద్ద, ఆర్టీసీ రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గత 20, 30 ఏళ్లుగా విశాఖ ఉక్కు పరిశ్రమలో పని చేస్తున్న 4500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించి, వారికి జీవనోపాధి లేకుండా చేశారన్నారు. కాంట్రాక్టు కార్మికులపై ఎన్‌డీఏ ప్రభుత్వం, పోలీసులు నిర్బంధాన్ని వీడి కార్మికుల హక్కుల చట్టప్రకారం తొలగించి వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

## మోదుగుల జాహ్నవికి ప్రతిభా అవార్డు



జ్నాహవికి ప్రశంసా పత్రం ఇస్తున్న మంత్రి

**తొట్టంబేడు:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన మండలంలోని పిల్లమేడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మోదుగుల జాహ్నవి సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా తిరుపతిలో షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది. టెన్త్‌లో జాహ్నవి 537మార్కులు సాధించింది. మంత్రి, కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డుతో పాటు రూ.20వేల నగదు, మెడల్ అందుకుంది.

**శ్రీకాళహస్తి విద్యార్థిని..**

**శ్రీకాళహస్తి:** శ్రీ వాణి విద్యామందిర్ టెన్త్ క్లాస్ విద్యార్థిని సేతుమాధవి కూడా షైనింగ్ స్టార్ అవార్డును అందుకుంది. కరస్పాండెంట్ విద్యాసాగర్, టీచర్లు అభినందించారు.

**విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు**



ఎన్.లీలాప్రసాద్

**నాగలాపురం:** రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులను ప్రకటించింది. ఈ మేరకు నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎన్.లీలాప్రసాద్ 575/600 మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు స్కూల్ హెచ్ఎం కస్తూరయ్య తెలిపారు. సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఉన్నతాధికారుల చేతుల మీదుగా విద్యార్థి అవార్డును అందుకున్నట్లు తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లీలాప్రసాద్‌ను అభినందించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బుచ్చినాయుడుకండ్రిగ: ర్యాలీ చేస్తున్న అధికారులు



యోగాంధ్రపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నారాయణవనంలో

**నాగలాపురం:** యోగ సాధన ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ బాలాజి నాయక్ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఎంపీడీఓ ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆధ్యాత్మిక శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**నారాయణవనంలో..**

**నారాయణవనం:** యోగాను నిత్య జీవితంలో దినచర్యగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన్న జీవనం సాగించాలని పలువురు వక్తలు తెలిపారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం నారాయణవనంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ట్రంకు రోడ్డు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సర్కిల్, నగరు వీధుల మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వేణయ్య, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

**బుచ్చినాయుడుకండ్రిగ:** ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రవీంద్రనాథ్, ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలోని పురవీధులలో అధికారులు, సచివాలయ సిబ్బంది యోగాపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, యోగా గురువు సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవంలో ఎస్టీయూ, సీపీఐ నాయకులు, టీచర్లు

**తొట్టంబేడు:** రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం శ్రీకాళహస్తి డివిజన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొట్టంబేడు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎస్టీయూ జెండాను ముఖ్యఅతిథిగా సీపీఐ శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటంలో తమవంతు భాగస్వామ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కత్తి రవి, రాష్ట్రోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేవేంద్ర పెరిమిడి, శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ సుధాకర్ యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ చిర్రి హరికృష్ణ, జిల్లా కార్యదర్శి గజేంద్రకుమార్, అసోసియేట్ అధ్యక్షులు గుమ్మడి మురళి, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు చీకటి చంద్రయ్య, వెంకటయ్య, చిట్టిబాబు, సీపీఐ శ్రీకాళహస్తి టౌన్ కార్యదర్శి గోపి, ఏఐఎస్ఎఫ్ శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి మునిచందు, ప్రజానాట్యమండలి మహిళా కార్యదర్శి చారులత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


**బుచ్చినాయుడుకండ్రిగలో..**

**బుచ్చినాయుడుకండ్రిగ:** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతో పాటు ఉపాధ్యాయ సమస్యల సాధనలో నిరంతరం కృషి చేస్తున్న సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం అని ఆ సంఘం రాష్ట్ర నాయకులు యువశ్రీమురళి అన్నారు. సోమవారం మండల అధ్యక్షులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి సమిటి వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సీ వద్ద ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు. బదిలీపై మండలానికి విచ్చేసిన ఉపాధ్యాయులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎస్టీయూ జెండా ఆవిష్కరణలో ఉపాధ్యాయులు

### ఆలయ పరిసరాల్లో పోలీసుల తనిఖీ



ఆలయ పరిసరాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు చేశారు. డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకే శ్రీకాళహస్తీశ్వరాలయ 1, 2, 3, 4వగేటు పరిసరాల్లో తనిఖీలు చేసినట్లు చెప్పారు. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని బీట్, బ్లూకోట్స్, రక్షక్, హైవే మొబైల్ ట్రాఫిక్ సిబ్బందితో పాటు సీఐలు, ఎస్ఐలు తనిఖీలలో పాల్గొన్నారు.